క్లుప్తంగా

బంటుమిల్లిలో ఇఫ్తార్ విందు



బంటుమిల్లి: బంటుమిల్లి జామియా మసీదులో గురువారం ఇఫ్తార్ విందు జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇఫ్తార్ విందు తీసుకుని ముస్లింలకు అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువకులకు క్రికెట్ కిట్లు అందజేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు టి. శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కమాల్‌బాషా, ఆలీం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి: స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ ఇంగ్లిష్ మీడియం 2023–24 విద్యాసంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల విద్యార్థులు ప్రవేశానికి అర్హులని చెప్పారు. ఆసక్తిగల వారు మే నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ గ్రూపులో 60, బైపీసీలో 40, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయని, పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక కృష్ణానది తీరంలోని ఫుడ్ కోర్ట్ ఆవరణలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు ఇరాలిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: రామకృష్ణాపురం సచివాలయం పరిధిలోని ఇరాలి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ పాండురంగారావు గురువారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



పెడన: పెడనలోని భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు నిరుపేద ముస్లింలు 100 మందికి రంజాన్ తోఫాను గురువారం అందజేశారు. పూర్వ విద్యార్థులు ఎండీ సిద్దిక్, హుస్సేన్‌బేగ్, కట్ట నాగేంద్రం, ఎండీ ఇబ్రహీం, డాక్టర్ లక్ష్మీసరోజని, రేలంగి అనంతలక్ష్మీ, అబ్దుల్ ఆలీమ్, గుల్జార్ జరీనా, సుబ్బిశెట్టి మధు తదితరులు సహాయ సహకారాలను అందించారని సిద్దిక్ తెలిపారు.

నేడు గంగాభవానీ అమ్మవారి నెల సంబరం



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి నెల సంబరాన్ని శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు గురువారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర పూర్తయి నెల రోజుల గడిచిన సందర్భంగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నెల జాతర నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం గణపతి పూజ, మండపారాధన, అఖండ స్థాపన, కుంకుమ పూజ జరుగుతాయన్నారు. అనంతరం పోతురాజు సంబరం, మహిళలచే చద్ది నైవేద్యాల సమర్పణ ఉంటుందన్నారు. రాత్రి ఆలయ గుడి సంబరాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

- ఆ దిశగా చర్యలు చేపట్టండి
- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి. రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న ఇళ్లకు సంబంధించి అధికారులు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ఆయన చాంబర్ నుంచి గురువారం జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా, మండలాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పునాది, ఆపై స్థాయిలో ఉన్న గృహాల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రోజుకు 945 గృహాలను దశలవారీగా పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. జిల్లాలో గన్నవరం, ఉంగుటూరు, ఉయ్యూరు, చల్లపల్లి మండలాలు పురోగతిలో చాలా వెనుకబడి ఉన్నాయన్నారు. ఆ ప్రాంతాల్లో ఆర్డీఓలు క్షేత్ర పర్యటనలు చేసి వాస్తవ విషయాలు తెలుసుకుని పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహాల నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇనుము, ఇసుక తదితర సామగ్రి సిద్ధం చేసుకోవడంతో పాటు బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేలా తోడ్పడాలన్నారు. జిల్లాలో రీ–సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని సర్వేయర్లు అందర్నీ ఈ కార్యక్రమానికి వినియోగించుకుని వేగవంతంగా రీ–సర్వే పనులను పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటలకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో పరిష్కరించిన ప్రజల అర్జీలు సంతృప్తికరంగా ఉన్నాయో లేదో గమనించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకవేళ ఏదైనా అసంతృప్తి ఉంటే సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన అర్జీలు మళ్లీ వస్తుంటే జిల్లా అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రీ–సర్వే పనులు వేగవంతం చేయండి.

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన గృహ నిర్మాణం, రీ–సర్వే తదితర అంశాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణం, రీ–సర్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూ సేకరణ, స్పందన, వ్యవసాయం, భూ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి జిల్లా పురోగతిని ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రీ–సర్వే ప్రగతికి సంబంధించి ఇప్పటి వరకు 109 గ్రామాల్లో పూర్తి చేసి 13వ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వెబ్‌ల్యాండ్ 2.0లో 97 గ్రామాల రీ–సర్వే డేటాను అప్‌లోడ్ చేశామని, 31,463 మందికి భూ హక్కు పత్రాలు ఇచ్చామన్నారు. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి హంసలదీవి వద్ద బీచ్, రిసార్ట్స్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డీఆర్వో ఎం వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ బి. శివనారాయణరెడ్డి, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ చైతన్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ ఎస్సీ ఉద్యోగులు



చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ పి. రాజాబాబును ఏపీ రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు గురువారం కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో సంఘ నాయకులు పుష్పగుచ్ఛం, బుద్ధుని విగ్రహాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఏపీ రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ చిట్టిబాబు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ తూము వెంకటేశ్వరరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

మోపిదేవి: జిల్లాలో మిగిలిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీడీపీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రావి దుర్గావాణి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటేనే నమ్మకం

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

కోడూరు: జగన్ అంటేనే నమ్మకమని, ఆయన మాట ఇచ్చారంటే అమలు చేస్తారని, అన్నివర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేయడమే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ శ్రేణుల వద్ద ప్రజలు పేర్కొంటున్నారు. 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. మండలంలోని రామకృష్ణాపురం, హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లో గురువారం ఈ కార్యక్రమాన్ని మండల సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నేతలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికులు మాట్లాడుతూ తమకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ఆనందం వ్యక్తంచేశారు. కుల,మతాలు, పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని నేతలు కోరారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచులు కొక్కిలిగడ్డ భిక్షాలు, వెన్నా షైనీ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బ్రహ్మయ్యగారిమూలలో..



బ్రహ్మయ్యగారిమూలలో నాగప్రసాద్ తదితరులు

ఎదురుమొండి(నాగాయలంక): ఎదురుమొండి శివారు బ్రహ్మయ్యగారిమూల గ్రామంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి) పర్యవేక్షణలో ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్ నేతృత్వంలో గ్రామంలోని 170 గృహాలకు తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు ఆరేపరపు శివరామకృష్ణ, విశ్వనాథపల్లి అంకరాజు, ఆరేవరపు వెంకటేశ్వరరావు, గృహ సారథులు, పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: జగనన్నే మా నమ్మకం.. మా భవిష్యత్తు జగనన్నే.. అంటూ గ్రామాలలో ప్రజలు ముక్తకంఠంతో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సచివాలయాల మండల కన్వీనర్ కొక్కిలిగడ్డ బాపూజీ, యండపల్లి సర్పంచ్ పిన్నెంటి ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో కరపత్రాలు అందిస్తున్న కన్వీనర్లు, గృహ సారథులు

- మోపిదేవి: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగ మల్లేశ్వరరావు అన్నారు. పార్టీ నాయకులు, గృహసారథులు ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందించిన పథకాలు వివరించామని చెప్పారు. గురువారం వరకు 12 గ్రామ సచివాలయాల్లో కార్యక్రమం పూర్తయిందన్నారు. మండలంలో 95 శాతానికి పైగా పూర్తి చేశామని, గడువు పెంచినందున నూరుశాతం సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కె. వెంకట సురేష్‌బాబు, కె. రాంబాబు, ఎస్. అభిషేకరావు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వేణుగోపాలపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. సాలెంపాలెం సచివాలయం పరిధిలోని వేణుగోపాలపురం గ్రామంలో రమేష్‌బాబు, యువ నేత సింహాద్రి వికాస్‌లు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులు పొందిన సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందించారు. అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్, ఆసరా, జగనన్న చేయూత, రైతు భరోసా తదితర పథకాలు తమకు అందుతున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. 22ఏ జీవో ద్వారా భూములను గత పాలకులు నిషేధిత జాబితాలో చేర్చితే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ జీఓను రద్దు చేసి తమ భూములపై హక్కు కల్పించారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, కుళాయి నీరు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ అధికారులతో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీ బడే హేమగంగాధర్, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఈఓపీఆర్డీ యలవర్తి సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

ముందుకు పారని మురుగుతో ఇబ్బందులు



డ్రెయిన్‌లో పేరుకుపోయిన గడ్డి, యాసిడ్ వ్యర్థాలు

మచిలీపట్నంటౌన్: ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంతంలో నూతన కాలనీ వద్ద ఉన్న ప్రధాన డ్రెయిన్ వ్యర్థాలతో నిండటంతో మురుగునీరు ముందుకు పారడం లేదు. కళాశాల ముందు నుంచి, పక్క నుంచి మురుగునీరు పారేందుకు పక్కా డ్రెయిన్లు నిర్మించారు. ఈ డ్రెయిన్లలో పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో వ్యర్థాలతో పాటు గడ్డి మొలిచి నీటి పారుదలకు అడ్డంకిగా మారింది. నూతన కాలనీకి ఎదురుగా ఉన్న వెండి పరిశ్రమ నుంచి డ్రెయిన్‌లోకి వదులుతున్న యాసిడ్ వ్యర్థాలతో డ్రెయిన్ నుంచి దుర్గంధం వెదజల్లుతోందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. దుర్వాసనతో శ్వాసకోశ, కంటి వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలగించి, డ్రెయిన్‌లో వదులుతున్న యాసిడ్ వ్యర్థాలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో హిమోఫీలియా దినోత్సవం



ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను, పేర్ని కిట్టును సన్మానిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: హిమోఫీలియా వ్యాధిగ్రస్తులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో గురువారం హిమోఫీలియా సొసైటీ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో హిమోఫీలియా దినోత్సవాన్ని నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ హిమోఫీలియా వ్యాధితో బాధపడే రోగులు ప్రభుత్వ సాయం లేక గతంలో ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 10 వేల పింఛనును అందజేస్తున్నారని చెప్పారు.

దీంతో బాధితులు ఇబ్బంది లేకుండా చికిత్స పొందుతున్నారన్నారు. సర్వజన ఆసుపత్రిలో హిమోఫీలియా బాధితులకు వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ అందిస్తున్న సేవలు మరువరానివన్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టును ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను, ఆర్ఎంఓ పి. రామచంద్రరావును, వైద్యులను, ఆరోగ్యశ్రీ సిబ్బందిని, నర్సులను హిమోఫీలియా సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చీలి రవీంద్ర, హిమోఫీలియా సొసైటీ సభ్యులు తరకటూరి సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మూల్యాంకనం



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతి పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం రెండో రోజైన గురువారం కొనసాగింది. స్థానిక లేడీ యాంప్టిల్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి ప్రతి ఉపాధ్యాయునికి 20 జవాబు పత్రాలు అందజేశారు. అలాగే మధ్యాహ్నం మరో 20 జవాబు పత్రాలు అందజేశారు.

జవాబుపత్రాల మూల్యాంకనాన్ని జిల్లా అబ్జర్వర్, డైరెక్టర్ పాఠశాల విద్యా శాఖ మస్తానయ్య, డీఈఓ తాహెరాసుల్తానా, డీవైఈఓ యూవీ సుబ్బారావు పరిశీలించారు. జిల్లా అబ్జర్వర్ మస్తానయ్య విద్యాశాఖాధికారులకు మూల్యాంకనం విధానంలో పలు సూచనలు చేశారు.

రూ. 90 లక్షలతో శ్రీవారి ఆలయ పునర్నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయం

నాగాయలంక: స్థానిక కృష్ణానది ఒడ్డున శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ ప్రాంగణంలో చేపట్టిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ఏడాది ఆగస్ట్ 20న ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాత ఆలయం తొలగింపుతో ప్రభుత్వ దేవదాయ శాఖ సర్వ శ్రేయో నిధి (సీజీఎఫ్) రూ.60 లక్షలు మంజూరు చేయగా, మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.30 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని దాతల సహకారంతో ఆలయ ధర్మకర్త, కమిటీ విరాళాలు సమకూర్చుతున్నారు. ఆలయ ప్రధాన భాగం గోడలు, శ్లాబు నిర్మాణం పూర్తయింది. అలయ గర్భగుడి గోపుర శిఖరాల నిర్మాణం, ధ్వజ స్తంభం ఎదుట ప్రహరీ అనుసంధాన రాజగోపురం పనులు, గోపురాలపై దేవతామూర్తుల అలంకార పనులు చేపట్టవలసి ఉందని ధర్మకర్త తెలిపారు. దేవదాయ శాఖ టెక్నికల్ అధికారి భవిరి రవి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయ ధర్మకర్త గడ్డిపాటి నాగేశ్వరరావు నిర్మాణ పనులు త్వరిగతిన పూర్తయ్యేందుకు కృషి చేస్తున్నారు.

వేట కొనసాగిస్తే చర్యలు తప్పవు

కోనేరుసెంటర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేట కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గిలకలదిండి మెరైన్ సీఐ శ్యామ్‌కుమార్ హెచ్చరించారు. గిలకలదిండి మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన బోటు యజమానులు, కళాసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సముద్ర వేటకు వెళ్లినట్లు తెలిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ చంద్రబోస్, ఏఎస్‌ఐ మురళీకృష్ణ, బోటు యజమానులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఉనికి కోసం ఉద్యమించే వారిని నమ్మవద్దు

ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: రాజకీయ ఉనికి కోసం ఉద్యమించే పార్టీల నాయకులను నమ్మవద్దని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నియోజకవర్గ రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వరి కుప్పలు నూర్చని రైతులను గుర్తించి, వారిలో ధాన్యం విక్రయాలకు సిద్ధంగా ఉన్న రైతుల ద్వారా 20 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. నియోజకవర్గంలోని రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకుని టీడీపీ నాయకులు వారి ఉనికిని కాపాడుకునేందుకు దొంగ ధర్నాలు, నిరసనలు చేస్తున్నారని, ప్రజలు, రైతులు వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే కోరారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం పాదచారులకు మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె. అనూష మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



బంటుమిల్లి: అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. బంటుమిల్లి మండల అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా మండలంలో వివిధ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులకు అధికారి కె. వెంకటేశ్వరరావు, సిబ్బంది ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రమాదాలు తలెత్తితే 101 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

'మిషన్ వాత్సల్య' అనాథ బాలలకు వరం

చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్

మండవల్లి: అనాథ బాలలకు 'మిషన్ వాత్సల్య' పథకం వరమని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ డైరెక్టర్ జె. రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మండవల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సమావేశ మందిరంలో గురువారం మిషన్ వాత్సల్య పథకంపై కైకలూరు, మండవల్లి ప్రాజెక్ట్ పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో అనంద్ కుమార్ సమావేశానికి అధ్యక్షత వహించారు. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన, నిస్సహాయులు, అనాథలైన 18 ఏళ్లలోపు బాలలకు మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా ప్రతి నెలా రూ.4,000 ఆర్థిక భరోసా కల్పిస్తారని చెప్పారు. అర్హులను మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలించి రాష్ట్ర స్థాయి అధికారులకు మంజూరు కోసం సమర్పించాలన్నారు. ఎంపీడీవో మల్లేశ్వరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ

పామర్రు(తోట్లవల్లూరు): ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు సాధించవచ్చని అవగాహన కల్పిస్తూ బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం కుమ్మమూరులో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యూరు ఏరువాక కేంద్రం రావెస్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు.

పేరు మార్పు

కాగిత నాగమల్లి (పాతపేరు), W/o. నాగేశ్వరరావు, 1-92, అర్తమూరు, కృష్ణాజిల్లా, ఆం.ప్ర.-521 369 అను నా పేరును కాగిత నాగమణి (కొత్తపేరు)గా మార్చుకున్నాను. ఇక నుండి నా పేరు కాగిత నాగమణిగా గమనించగలరు.

మాజీ ఎంపీపీ లక్ష్మణబాబు మృతి



గూడూరు: గూడూరు మాజీ ఎంపీపీ వార్త లక్ష్మణబాబు (74) గురువారం మృతిచెందారు. కప్పలదొడ్డి గ్రామానికి చెందిన వార్త లక్ష్మణ్‌బాబు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉన్నారు. 1981–87 మధ్య కాలంలో కప్పలదొడ్డి గ్రామ సర్పంచ్‌గా, 2001–06 మధ్యకాలంలో గూడూరు ఎంపీపీగా పనిచేశారు. లక్ష్మణ్ బాబు మృతికి పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

దేవస్థానంలో షాపులకు వేలం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో పలు షాపుల నిర్వహణకు ఆలయ ప్రాంగణంలో ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు 11 నెలల కాలానికి గాను వేలం పాటలు నిర్వహించామన్నారు. దేవస్థానంలో భక్తుల ఫొటోలు తీసి ఇచ్చుటకు ఎస్. సాంబశివరావు రూ. 1.75 లక్షలకు పాడుకున్నారన్నారు. ఆవు పెరుగు సరఫరా పాట, శ్రీ గోకులం వద్ద పచ్చగడ్డి విక్రయం, ఎండి గడ్డి సరఫరా చేసే పాటలకు ధరావత్తు చెల్లించనందున వాయిదా వేశామని చెప్పారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు, పాటదారులు పాల్గొన్నారు.